
రంజాన్ వేళలు
ఇఫ్తార్(మంగళవారం-6:32)
సహర్ (బుధవారం-5:07)

డీ1 డేంజర్



- ఆ జోన్‌లో కొందరి ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించిన సహాయక బృందాలు
- అక్కడి నుంచి 50 మీటర్ల పరిధి మొత్తం షీర్ జోన్‌గా నిర్ధారణ
- డీ1 నుంచి డీ2 వరకు 20 మీటర్ల పరిధిలో కార్మికుల ట్రెంచ్ తవ్వకం
- మట్టి బయటకు తరలించే మార్గం లేకపోవడంతో పనులకు ఆటంకం
- గంటకు జానెడు మాత్రమే తవ్వకం.. ఊటనీటితో ఆలస్యం

డీ2 ప్రాంతంలో తవ్వకాలు చేపడుతున్న సింగరేణి కార్మికులు

మహబూబ్‌నగర్, దోమలపెంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆనవాళ్లు కనిపెట్టడానికి అన్వేషణ నిర్విరామంగా కొనసాగుతోంది. మొత్తం నాలుగు షిఫ్టులుగా 12 ఏజెన్సీల సిబ్బంది పని చేస్తున్నారు. కార్మికుల ఆనవాళ్లు దొరకవచ్చని భావిస్తున్న ప్రాంతాలను డీ1, డీ2గా నిర్ధారించగా.. ఆదివారం గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం డీ2 ప్రాంతంలో దొరికింది. అయితే డీ2 ప్రాంతం సేఫ్ జోన్ కాగా.. డీ1 ప్రాంతం మాత్రం డేంజర్ జోన్‌లో ఉంది. ఇక్కడ తవ్వకాలకు అనేక ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. టన్నెల్ కూలిన ప్రాంతానికి అతి చేరువలో డీ1 ఉండగా.. అక్కడ తవ్వితే కొందరి ఆనవాళ్లు లభించవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌డీఆర్‌ఎఫ్, ర్యాట్ మైనర్స్, సింగరేణి ఆధ్వర్యంలో డీ1 ప్రాంతంలో తవ్వకాలు సాగుతున్నప్పటికీ, ఆ ప్రాంతం సున్నితంగా ఉండటంతో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రమాదం జరిగిన స్థలం నుంచి బయటవైపునకు దాదాపు 50 మీటర్లు అత్యంత ప్రమాదకరమైన షీర్ జోన్ ఉందని గతంలో ఎన్‌జీఆర్‌ఐ, జీఎస్‌ఐ, సిస్మాలజీ వారు నిర్ధారించారు. ఆ 50 మీటర్ల పరిధిలో డీ1 కూడా ఉంది. సోమవారం డీ2 ప్రాంతానికి జేసీబీ ఎర్త్‌మూవర్ చేరుకోగా.. అక్కడ తవ్వకాలు వేగంగా జరిగే అవకాశం ఉంది. కానీ డీ1 ప్రాంతంలో మాత్రం ఇబ్బందికరంగా ఉంది. అయితే డీ2 నుంచి డీ1కు ఒక ట్రెంచ్‌ను తవ్వుతున్నారు. ఆ మార్గంలో కార్మికుల ఆనవాళ్లు ఏమైనా లభించవచ్చని భావిస్తున్నారు. ట్రెంచ్ తవ్వడంతో డీ1 ప్రాంతంలో నేరుగా తవ్వకుండానే ట్రెంచ్ ద్వారా ఆనవాళ్లు దొరికే అవకాశం ఉంది.

మట్టి తీయడమే ప్రతిబంధకం..

టన్నెల్‌లో రెండుసార్లు ప్రమాదం జరగ్గా.. దాదాపు 300 మీటర్ల వరకు బురద మట్టి, టీబీఎం వ్యర్థాలు ముందుకు వచ్చాయి. మొదట టీబీఎం భాగాలను ప్లాస్మా, థర్మో కట్టర్ల ద్వారా రైల్వే సిబ్బంది కట్ చేస్తూ, వాటిని లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. అది కూడా ఆలస్యం కావడంతో ఒక సైడ్‌కు సెట్ చేస్తున్నారు. లోపల తవ్వకాలు వేగంగా జరగడానికి జేసీబీ ఎర్త్‌మూవర్‌ను లోపలకు పంపించారు. సోమవారం డీ2 ప్రాంతానికి చేరుకుంది. అయితే మట్టి తరలింపునకు చాలా కీలకమైన కన్వేయర్ బెల్టు నేటికీ ఉపయోగంలోకి రాలేదు. ట్రయల్ రన్ చేస్తున్నప్పటికీ.. 13.5 కిలోమీటర్ వరకే ఈ బెల్టు ఉంది. ప్రస్తుతం సహాయక చర్యలు 13.7 నుంచి 13.8 మధ్యలో జరుగుతున్నాయి. అంతదూరం నుంచి మట్టిని తీసుకొచ్చి బెల్టుపై వేసే అవకాశం లేదు. దీంతో గుర్తించిన ప్రాంతాల్లో మట్టిని తవ్వి పక్కకే వేస్తున్నారు. మట్టిని తవ్విన తర్వాత గుంతల్లో నీటి ఊట వస్తుండటంతో పంపులను ఏర్పాటు చేస్తున్నారు. నీటిని తోడివేసిన తర్వాత మళ్లీ తవ్వకాలు చేపట్టడంతో గంటకు జానెడు మాత్రమే తవ్వగలుగుతున్నట్లు సహాయక బృందాలు చెబుతున్నాయి. అయితే డీ2 ప్రాంతానికి ఎర్త్‌మూవర్ చేరుకోవడంతో మంగళవారం పురోగతి వస్తుందని అంచనా వేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ..

షీర్ జోన్‌తోపాటు మిగతా ప్రాంతాల్లో సహాయక చర్యలను ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు లోపలకు వెళ్లి మరీ పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా పరిస్థితులను అప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇప్పటికే ఎన్‌జీఆర్‌ఐ, జీఎస్‌ఐ, సిస్మాలజీ ఆధ్వర్యంలో షీర్ జోన్‌పై హెచ్చరికలు స్పష్టంగా ఉన్నాయి. కానీ అక్కడ తవ్వితే కానీ చిక్కుకున్న వారి ఆచూకీ లభించడం చాలా కష్టం కానుంది. అలాగే స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, సింగరేణి జీఎం డీఎల్ బైద్య, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్నారు. లోపలకు వెళ్లాల్సిన బృందాలు, వారికి కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. అయితే లోకో ట్రైన్ లోపలకు వెళ్లి బయటకు రావడానికి నాలుగు గంటల సమయం పడుతుండటం కూడా సహాయక చర్యలకు ఇబ్బందిగా మారిందని చెప్పొచ్చు.



డీ1 నుంచి డీ2 జోన్ వరకు టన్నెల్‌లో పేరుకుపోయిన మట్టి



ముడా సమావేశంలో పాల్గొన్న(కుడి నుంచి) ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

రూ.41.82 కోట్ల పనులకు ముడా ఆమోదం

- వెంటనే టెండర్లు నిర్వహించి పనులు చేపట్టాలి
- పాలక మండలి ఏర్పాటుకు చర్యలు
- రూ.500 కోట్లు కేటాయించాలని సీఎంకు ప్రతిపాదనలు పంపించాం
- సమావేశంలో ఎమ్మెల్యేలు
- ఏఈల కొరత పరిష్కరించాలన్న అధికారులు

మహబూబ్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ద్వారా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు సిద్ధం చేశారు. వాటిని ముడా సమావేశంలో ఆమోదించారు. సోమవారం ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ అధ్యక్షతన ముడా కార్యాలయంలో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముడా పరిధిలోని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి హాజరుకాగా, మరో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గైర్హాజరయ్యారు. రెండు నెలల క్రితమే ముడా సమావేశం నిర్వహించగా, అప్పట్లో ఎమ్మెల్యేలు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పూర్తిస్థాయిలో తేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

శాశ్వత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

అధికారులు, ఎమ్మెల్యేల సమక్షంలో జరిగిన ప్రస్తుత సమావేశంలో పలు అంశాలను చర్చించారు. ముడా పరిధిలో రూ.41.82 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు. వెంటనే వీటికి టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో రూ.13.75 కోట్లు, దేవరకద్రలో రూ.10.70 కోట్లు, జడ్చర్లలో రూ.9.71 కోట్లు, నారాయణపేట నియోజకవర్గంలో రూ.79 లక్షలు, పరిగి నియోజకవర్గంలోరూ.75 లక్షలకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు ఇచ్చారు. వీటితో మరో రూ.6.12 కోట్ల పనులకు కూడా ప్రతిపాదలను తయారుచేసి సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ నిధులు పార్కుల అభివృద్ధి, కొత్త పార్కుల ఏర్పాటు, కమ్యూనిటీ భవనాలు, ఆర్వో వాటర్‌ప్లాంట్‌లు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్, ఎల్‌ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ నిధులను అనవసరమైన తాత్కాలిక పనులకు కేటాయించకుండా అందరికీ ఉపయోగపడేలా శాశ్వతంగా ఉండే పనులకు వెచ్చించాలని నిర్ణయించారు.

పారదర్శకంగా ఉపయోగపడేలా చూడాలి

గతంలో హరితహారం పేరిట నిధులను దుర్వినియోగం చేశారని, ఇప్పుడు ప్రతిపైసా పారదర్శకంగా ఉపయోగపడేలా చూడాలని ఎమ్మెల్యేలు చైర్మన్‌కు సూచించారు. అయితే సమావేశంలో పాల్గొన్న అధికారులు మాత్రం ఈ పనులన్నీ చేపట్టాలంటే నియోజకవర్గాల్లో ఇంజనీరింగ్ అధికారులు కావాలని, డీఈ, ఏఈ పోస్టులను భర్తీ చేయకపోతే పనులకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యేలు అధికారుల నియామకాల కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ప్రస్తుతం ముడా చైర్మన్ మాత్రమే ఉండగా డైరెక్టర్‌లతో కూడిన పాలక మండలి ఏర్పాటు కాలేదని, ఇప్పటికే ఆయా నియోజకవర్గాల నుంచి డైరెక్టర్ల పేర్లను ప్రతిపాదించామని చెప్పారు. ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఉందని, ఈ వారంలో ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా ముడా బలోపేతం కోసం రూ.500 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, ఈ విషయంలో సీఎంను కలుస్తామని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.



జడ్చర్ల మునిసిపల్ సాధారణ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు

ఆ రోడ్డుకు నిధులు కేటాయించొద్దు

- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి
- జడ్చర్ల మునిసిపల్ సమావేశంలో కౌన్సిలర్లు
- పనులపై సమాచారం ఇవ్వని అంశంపై ఇద్దరి మధ్య వాగ్వాదం
- రసాభాసగా సాధారణ మీటింగ్

జడ్చర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలో ఓ ప్రైవేట్ వెంచర్ రోడ్డు నిర్మాణానికి నిధులను కేటాయించొద్దని కౌన్సిలర్‌లంతా వెల్లడించారు. ప్రైవేట్ వెంచర్‌ల నిర్వాహకులు, వెంచర్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రోడ్డు నిర్మాణం చేసుకుంటారని, ఆ వెంచర్ కోసం కేటాయించే నిధులతో ఇతర వార్డులలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అధ్యక్షతన వైస్ చైర్‌పర్సన్ పాలాదిసారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి సమక్షంలో సోమవారం మునిసిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎజెండాలోని అంశాలను ఒక్కొక్కటి చర్చించిన అనంతరం ఇతర అంశాలపై చర్చించారు. మునిసిపాలిటీ తీర్మానం లేకుండా చేపట్టిన వివిధ పనులకు బిల్లులు చెల్లించవద్దని కౌన్సిలర్‌లు సూచించారు. తన వార్డులో జరిగిన పనులకు కనీస సమాచారం ఇవ్వలేదని, సమాచారం అందించి ఉంటే తానే దగ్గర ఉండి పని చేయించేవాడిని అంటూ కౌన్సిలర్ సతీష్ చెప్పాడు. తమ ప్రభుత్వం ఉందని, అధికార పార్టీకి చెందిన ఎవరైనా పనులు చేసుకుంటారని, ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదంటూ మరో కౌన్సిలర్ కుమ్మరిరాజు అనడంతో ఇద్దరి కౌన్సిలర్‌ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వీరిద్దరిని సముదాయించేందుకు తోటి కౌన్సిలర్‌లు శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. రాబోయే వేసవికాలంలో మునిసిపాలిటీలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. మునిసిపాలిటీ పరిధిలో ఎక్కడపడితే అక్కడ అనుమతులు లేకుండానే ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇళ్లను నిర్మిస్తున్న వారికి నోటీసులు ఇవ్వాలని కౌన్సిలర్‌లు కోరారు. అనుమతులు లేని ఇళ్ల నిర్మాణాలతో మునిసిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండిపడుతోందని వివరించారు. వీటితో పాటు పలు అంశాలపై కౌన్సిలర్‌లు చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్‌లు నందకిశోర్‌గౌడ్, చైతన్యచౌహాన్, శశికిరణ్, రఘురాంగౌడ్, రమేశ్, శ్రావణి, జ్యోతి, నవనీత, చైతన్యగౌడ్, లలితలతో పాటు పలువురు కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

- మహబూబ్‌నగర్ జిల్లా మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో ఘటన



పూల మహేశ్ (ఫైల్)

మూసాపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్ పల్లిలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ముక్కలపల్లి వేణు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూల మహేశ్ (39) అనే యువకుడు, ఐదు సంవత్సరాల క్రితం ఫైనాన్స్‌లో రూ.30 లక్షలు రుణం తీసుకుని రెండు వరికోత యంత్రాలు (హార్వెస్టర్లు) తీసుకున్నాడు. అవి సక్రమంగా నడవకపోవడంతో కిస్తులు కట్టలేకపోయాడు. అలాగే భూమిని కౌలుకు తీసుకొని అప్పు చేసి మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగు చేశాడు. కానీ పంటలు సరిగా పండక నష్టపోయాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక, తీర్చే పరిస్థితి లేక తీవ్ర మనస్తాపానికి గురైన మహేశ్ ఆదివారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరాడు. గమనించిన కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు సోమవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చేనేత కార్మికుల్లో ఆశలు

- రుణమాఫీకి రేవంత్ సర్కారు గ్రీన్ సిగ్నల్
- నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వ్యక్తిగత రుణాలు తీసుకున్న 227 మంది కార్మికులు
- రూ.కోటీ 79 లక్షలు మాఫీ కోసం ఎదురుచూపు

నారాయణపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ చేనేత కార్మికుల రుణమాఫీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం ప్రాథమిక అనుమతులు ఇవ్వడంతో గత సెప్టెంబరు నుంచి ఎదురుచుస్తూన్న చేనేత కార్మికుల్లో ఆశలు చిగురించాయి. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 227 మంది కార్మికులు రూ.కోటీ 79 లక్షలు వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. కార్మికుల రుణాలకు సంబంధించి బ్యాంకుల నుంచి వివరాలు తీసుకొని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు అప్పట్లోనే ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. నారాయణపేట జిల్లాలో 735 లూమ్స్ ఉన్నాయి. 147 మంది కార్మికులకు సంబంధించి రూ.77.08 లక్షలు వ్యక్తి గత రుణాలు ఉన్నాయి. మహబుబ్‌నగర్ జిల్లాలో 188 లూమ్స్ ఉండగా 80 మంది కార్మికుల వ్యక్తిగత రుణాలు రూ.33.71 లక్షలు ఉన్నాయి. రెండు జిల్లాలో రూ.కోటీ 79 లక్షల రుణాలు ఉన్నాయి. అయితే రుణమాఫీకి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రతీ ఒక్కరికి రూ.లక్ష మాఫీ చేస్తారా? లేక ఎంత ఉంటే అంత మాఫీ చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. కార్మికుల వ్యక్తిగత రుణాల జాబితాను చేనేత జౌళిశాఖ అధికారులు పరిశీలించి, బ్యాంకుల వారిగా ఫీల్డ్ ఆఫీసర్లతో మరోసారి క్రాస్ చెకింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ జాబితాను కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలించి, తుది జాబితాను ప్రభుత్వానికి పంపించనున్నారు. 2014 నుంచి 2017 వరకు తీసుకున్న రూ.లక్షలోపు వ్యక్తిగత రుణాలను అప్పటి ప్రభుత్వం మాఫీ చేసింది. అప్పటి నుంచి కార్మికులు మళ్లీ రుణాలు తీసుకున్నారు. 2017 ఏప్రిల్ నుంచి 2024 మర్చి వరకు తీసుకున్న రూ.లక్ష రుణాలు మాఫీ చేయాల్సి ఉంది.



నారాయణపేటలో మగ్గంపై కాటన్ చీర నేస్తున్న కార్మికులు



అంబులెన్స్‌లో నవజాత శిశువుకు ఆక్సిజన్ అందిస్తున్న ఈఎంటీ రాజ్‌కుమార్

నవజాత శిశువుకు సీపీఆర్

- ప్రాణం కాపాడిన 108 సిబ్బంది
- కుటుంబ సభ్యుల ఆనందం

నారాయణపేట, మార్చి 10 (అంధ్రజ్యోతి) : అప్పుడే పుట్టిన శిశువు కదలికలు లేకపోవడంతో 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. నారాయణపేట జిల్లా, నర్వ మండలం రాయికోడ్ గ్రామానికి చెందిన అఖిల తొలి కాన్పు కోసం సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు నర్వ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఐదున్నర గంటలకు మగశిశువుకు జన్మనిచ్చింది. కానీ తల్లి కడుపులో ఉన్నప్పుడే ఉమ్మనీరు తాగడంతో కదలికలు లేకపోవడం, శ్వాస ఆడకపోవడం, ఏడవక పోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మెరుగైన వైద్య సేవల కోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించేందుకు డ్యూటీలో ఉన్న నర్సు కవిత 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. దీంతో అంబులెన్స్ వెంటనే ఆసుపత్రికి చేరుకున్నది. అదే అంబులెన్స్‌లో విధుల్లో ఉన్న ఈఎంటీ రాజ్‌కుమార్ శిశువును పరీక్షించి ప్రాణం ఉన్నట్లు నిర్ధారించుకున్నాడు. వెంటనే మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యుడు శివకు ఫోన్ చేసి, పరిస్థితిని వివరించారు. ఆయన సూచనలతో అంబులెన్స్‌లోనే శిశువుకు సీపీఆర్ చేస్తూ, ఆక్సిజన్ అందిస్తూ మహబూబ్‌నగర్‌కు బయలు దేరారు. అంబులెన్స్ మార్గంమధ్యలోని దేవరకద్ర సమీపానికి చేరుకుంటుండగా శిశువులో కదలిక కనిపించింది. అలాగే చికిత్స అందిస్తూ ఆరున్నర గంటల సమయంలో శిశువును మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి చేర్చారు. అక్కడ చిన్న పిల్లల వైద్యురాలు మమత చికిత్స అందించి, శిశువు కోలుకున్నట్లు ప్రకటించారు. దాంతో వైద్యులు, అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ 108 అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.

ఆహార భద్రతకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించి, ఆహార భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో జిల్లా ఆహార భద్రత సలహా మండలిని ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలి చైర్మన్‌గా కలెక్టర్ ఉంటారని, రెవెన్యూ అదనపు కలెక్టర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ తదితరులు సభ్యులుగా ఉంటారని సూచించారు. జిల్లాకు నూతనంగా రీజినల్ ఫుడ్ ల్యాబొరేటరీ రాబోతుందని, అలాగే ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం వస్తుందని చెప్పారు. జిల్లాలో మరింత మెరుగ్గా ఆహార కల్తీ నిరోధానికి పాటు పడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్, డీఈవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారదగడ్డ చెన్న బసవేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో పుట్టీల పోటీలు



కృష్ణానది వద్ద పోటీ పడుతున్న పుట్టీలు

మక్తల్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ముస్లాయిపల్లి గ్రామ సమీపంలో కృష్ణానది మధ్యలో నారదగడ్డలో వెలసిన శ్రీచెన్న బసవేశ్వరస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం కృష్ణానదిలో పుట్టీల పోటీలు నిర్వహించారు. తక్కువ సమయంలో ఇవతలి ఒడ్డు నుంచి అవతలి ఒడ్డు చేరుకున్న వారిని ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి బండిబాబు, ద్వితీయ బహుమతి శివకుమార్, తృతీయ బహుమతి బస్వరాజుకు అందజేశారు. కార్యక్రమంలో మధు, వెంకటేష్, అంజి, రాములు, గోపాల్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా మాణికేశ్వరి మాత అవతారోత్సవాలు

దామరగిద్ద, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా దామరగిద్ద మండలంలో సద్గురు రూపరహిత అహింస యోగేశ్వరి వీరధర్మజ మాత మాణికేశ్వరి అమ్మవారి ఐదవ అవతారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు జరిగే ఐదవ అవతారోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అభిషేకం, 10 నుంచి 11 గంటల వరకు జపయజ్ఞం, 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సత్సంగ కార్యక్రమం, రాత్రి 9 గంటల నుంచి భజన కార్యక్రమం చేపట్టారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాణికేశ్వరి దివ్య సమాధిని దర్శించుకున్నారు. దత్తాత్రేయ ఆలయ ట్రస్టు కార్యదర్శి కృష్ణకొర్వార్, బండి శివరామ్‌రెడ్డి, మందర్ పాల్గొన్నారు.

ఆలయాలపై రాజకీయం తగదు

» జోగుళాంబ ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి

అలంపూరు, మార్చి10 (ఆంధ్ర జ్యోతి): అలంపూ రు జోగుళాంబ ఆలయాల విశిష్ట తకు భంగం కలి గిస్తున్నారని, ఆలయ విశిష్టత ను కాపాడే బా ధ్యత ప్రతీ ఒక్క రిపై ఉందని ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వ ర్‌రెడ్డి అన్నారు. జోగుళాంబ ఆలయంలో జరుగుతున్న పరిణామాలపై తన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల ఆలయంలో పలు అక్రమాలు జరిగాయని, దీనికి ఈవో, ఆలయ ప్రధాన అర్చకుడు కారణమంటూ ప్రధాన పత్రికలు, టీవీ చానళ్లలో వస్తున్న అవాస్తవ కథనాలు, దుష్ప్రచారాలను దేవస్థానం పాలకమండలి తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. సినీ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే విజ యుడు, ప్రధాన అర్చకుడి మధ్య జరిగిన వివాదానికి, ఆలయానికి ఎటు వంటి సంబంధం లేదన్నారు. ఇటీవల మహాశివరాత్రి తర్వాత పనికట్టు కుని ఆలయ ప్రతిష్టను, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కొందరు తెరవెనుక కుట్ర చేస్తున్నారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తామన్నారు. ఆలయంలోని కొందరు అర్చకులు, సిబ్బంది ఆలయ కమిటీని గౌరవించకుండా రియల్టర్ జయపాల్‌లాంటి భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ పాలకమండలి సభ్యులను అవమానిస్తున్నారని ఆలయ ధర్మకర్త కుర్వ గోపాల్ అన్నారు.

బీసీ కాలనీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్

» బీసీ కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం లోని 17వ వార్డు బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివా స్ డిమాండ్ చేశారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని శ్రీపురం రోడ్డు 17వ వార్డు బీసీ కాలనీ పరి రక్షణ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష లు ప్రారంభించారు. దీక్షలకు మద్దతు తెలిపిన ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీకాలనీ ఏర్పడిన ప్పటి నుంచి సమస్యల వలయంగా మారిందన్నారు. ప్రజాప్రతినిధులు, మునిసిపాలిటీ అధి కారులు స్పందించి బీసీ కాలనీలోని ఇళ్లకు నెం బర్లు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీక్ష శిబిరాన్ని బీఎస్పీ నాయకులు సం దర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీ ఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, నాయకులు యాదయ్య, అశోక్, రామయ్య, రమేష్, బీఎస్పీ జిల్లా ఇన్‌చా ర్జి పృథ్వీరాజ్, నాయకులు కళ్యాణ్, బీజేపీ నాయకులు వెంకటేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు

కల్వకుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్యాంగి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా బచ్చలి బంగారయ్య, ప్రధాన కార్యదర్శిగా ముడావత్ సోమ్లానాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాసోజు పరమేశ్‌చారి, సంయుక్త కార్యదర్శిగా వాడాల భీముడు, మండ్ల గోపాల్, అసిస్టెంట్ కార్యదర్శి మహ్మద్ ఖలీల్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు గంట శ్రీశైలం, ఇస్లావత్ బాన్‌సింగ్, కోశాధికారి మల్లేష్ తదితరులను కమిటీ ఎన్నుకున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

మానవపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర సోమవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అమరవాయి వైపు నుంచి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని జరిమానా విధించినట్లు మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. మండలంలోని మద్దూరు శివారులోని తుంగభద్ర నది నుంచి గద్వాలకు తరలిస్తుండగా రోడ్డు మ్యాప్, వాహన పత్రాలు, లైసెన్స్ లేకపోవడంతో జరిమానా వేసినట్లు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

గట్టు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాగదోణలో సోమవారం పిచ్చి కుక్క దాడిలో బోడ్డు వీరేష్ కూతురు నిహా రిక(4) గాయపడింది. అంగన్‌వాడీ స్కూల్ నుంచి ఇంటికి వెళ్తుండగా పిచ్చి కుక్క ఒకటి బాలికపై దాడి చేసింది. దీంతో బాలిక గట్టిగా రోదించడంతో స్థానికులు గమనించి కు క్కను తరిమారు. ఆమె తల్లిదండ్రులు వెంట నే అయిజలోని ఆసుపత్రికి తరలించారు. దాడి విషయం తెలియడంతో కుక్క కోసం గ్రామస్థులు వీధుల్లో గాలించారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు చెక్!

» 30 ఏళ్లు నిండిన వారందరికీ వైద్య పరీక్షలు

» జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

» గత నెల 20న ప్రారంభం, ఈ నెల 31 వరకు కొనసాగింపు

» జోగుళాంబ గద్వాల జిల్లాలో 3,60,984 మందికి పరీక్షలు

» అసాంక్రమిక వ్యాధుల కట్టడే లక్ష్యం



కొంకల గ్రామంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది





అయిజ మండలం, చిన్నతాండ్రపాడు గ్రామంలో పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్థులు

అయిజ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక, అసాంక్రమిక వ్యాధుల కట్టడి, నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహిస్తోంది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో 30 ఏళ్ల వయసు నిండిన వారందరికీ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా వైద్య పరీ క్షలు నిర్వహిస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొ త్తం జనాభా 6,94,219 మంది ఉన్నారు. వారిలో ముప్పై ఏళ్ల వయసు పైబడిన వారు 3.60 లక్షలపైనే ఉన్నారు. వారందరికీ జిల్లాలోని 15 ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేసే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో పాటు ఇతర సిబ్బంది అన్ని పని దినాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్య పరీక్షలు చేస్తున్నారు.

అయిదు రకాల పరీక్షలు

అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) కట్టడి కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్లు నిండి ప్రతీ ఒక్కరికీ బీపీ, షుగర్‌లతో పాటూ ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ లాంటి మూడు క్యాన్సర్ పరీక్షలు కూడా చేస్తున్నారు. పరీక్షలు తర్వాత వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరోగ్యసిబ్బంది ప్రత్యేకంగా చికిత్స మొదలుపెడతారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని గద్వాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలోని ఆసుపత్రులకు పంపించి, మెరుగైన చికిత్సలకు సిఫారసు చేయనున్నారు.

పేదవారికి ఎంతో మేలు



ప్రభుత్వం ముప్పై సంవత్సరాలు నిండిన వారందరికీ వైద్య పరీక్షలు చేయడం ఎంతో మేలు. పేద ప్రజలు పట్టణాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేరు. ఉన్నట్లుండి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరితే అప్పటికే వ్యాధి ముదిరిపోతోంది. దీంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇక్కట్ల పాలవుతున్నారు. ఇప్పుడు చేస్తున్న వైద్య పరీక్షల వల్ల వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ముందస్తుగా చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుంది.

– హనుమంతు, పులికల్ గ్రామం, అయిజ మండలం

ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి



అసాంక్రమిక వ్యాధుల కట్టడికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను 30 ఏళ్లు నిండిన వారందరూ చేయించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,87,180 మందికి అయిదు రకాల పరీక్షలు నిర్వహించాం. మిగిలిన వారందరికీ ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేస్తాం. ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఇళ్ల వద్దకు రావడంతో పాటు, గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స, మందులు అందిస్తాం. నిర్లక్ష్యం చేయకుండా ప్రతీ ఒక్కరూ ఈ వైద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలి.

– సిద్ధప్ప, జిల్లా వైద్యాధికారి, జోగుళాంబ గద్వాల

అల్వాలపాడు వాగులో నర్సరీ మొక్కలు, పాలిథిన్ కవర్లు

» అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



అల్వాలపాడు వాగులో పారబోసిన మొక్కలు, పాలిథిన్ కవర్లను పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ భారతి, గ్రామస్థులు

ధరూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాలపాడులో ఫీల్డ్‌అసిస్టెంట్‌తో పాటు సిబ్బంది నర్సరీని వేరే స్థలానికి మార్చా రు. కాగా, పాత నర్సరీలో ఉన్న సుమారు 1500 మొక్కలతో పాటు పాలిథిన్ కవర్లను, మట్టితో పాటు ట్రేలను గ్రామ శివారులోని వాగులో పారబోశారు. సుమారు రూ.లక్ష విలువగల మొక్కలను సంరక్షిం చాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి పారబోయడాన్ని గమనించిన గ్రా మస్థులు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశా రు. స్పందించిన ఏపీవో శరత్‌కుమార్, టెక్నిక ల్ అసిస్టెంట్ భారతి, అధికారులు గ్రామ శివా రులో వాగులో పారేసిన మొక్కలు, పాలిథిన్ క వర్లు పరిశీలించారు. ప్రభుత్వ ఖజానాకు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ గండికొడు తున్నట్లు ఈ సందర్భంగా అధికా రు లకు గ్రామస్థులు తెలిపారు. గతంలో కూడా అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకో వాలని కోరారు. స్థానికంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ గతం లో కూడా విధుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించారని, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను అర్హులకు కాకుం డా అనర్హులకు పని కల్పించారని తెలిపారు. అలాగే గ్రామంలో కూడా ఇంకుడు గుంతల ని ర్మాణాలతో పాటు తదితర పనులకు చేతివాటం ప్రదర్శించారు. అధికారుల దృష్టికి తెచ్చారు. ఈవిషయంపై స్థానిక ఏపీవో శరత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు గోపాల్ రెడ్డి, గోవిందు, మాజీ సర్పంచు ప్రతాప్, గుండె గోపాల్, యామారెడ్డి, నరసిం హులు, రాఘవేం ద్ర తెలిపారు.

నర్వలో జోరుగా కందుల కొనుగోలు

» క్యూ కట్టిన వాహనాలు



నర్వ లో కందుల కొనుగోలు కేంద్రం వద్ద కందులు తూకం వేస్తున్న రైతులు

నర్వ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో కందుల కొనుగోళ్లు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం కొనుగోలు కేంద్రం వద్ద ఆయా గ్రామాల నుంచి రైతులు తెచ్చిన కందుల లోడ్ ట్రాక్టర్‌లు బారులు తీరాయి. విక్రయానికి ముందుగా వచ్చిన రైతులు తమ ధాన్యాన్ని తూకం వేసి విక్రయించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మణ్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కందులు విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. 15 రోజుల నుంచి ఇప్పటికి 2500 క్వింటాళ్ల వరకు కందుల కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాల్ ధర రూ.7550కు కొనుగోలు చేస్తున్నామని వారు చెప్పారు. కాగా, అన్‌లోడింగ్ చేసి తూకం వేసి లోడింగ్ చేయుటకు హమాలీ ఖర్చు రూ.55 తీసుకుంటున్నారని రైతులు తెలిపారు. హమాలీ డబ్బులు తిరిగి చెల్లిస్తారా, లేదా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు.

నాలుగు రోజులు నీటి సరఫరాకు బ్రేక్

» తాగునీటి కోసం జనం పాట్లు

» సింగారం చౌరస్తాలో పూర్తయిన మిషన్ భగీరథ లీకేజీ పైప్‌లైన్ పనులు

» దేవరకద్ర దగ్గర మరోచోట మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో మరమ్మతులు

» పేటలో తాగునీటి కోసం తప్పని తంటాలు



పేట సుభాష్‌రోడ్ కలాల్‌వాడీలో మునిసిపల్ ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

నారాయణపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల మరమ్మతులతో నాలుగు రోజులుగా జిల్లాలో తాగునీటి సరఫరా నిలిచి నీటి కోసం జనాలు పాట్లు పడుతున్నారు. ఓవైపు దేవరకద్ర వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ పనులతో ఈనెల 8 నుంచి నీటి సరఫరాకు బ్రేక్ పడింది. దాంతో జిల్లాలో 245 గ్రామాలతో పాటు నారాయణపేట, మక్తల్ మునిసిపాలిటీల్లో నీటి సరఫరా లేక తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే సమయంలో నారాయణపేట మండలంలోని సింగారం చౌరస్తా దగ్గర నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు మూడురోజుల పాటు మునిసిపల్ సిబ్బంది శ్రమించి మరమ్మతులు పూర్తి చేశారు. సోమవారం తాగునీరు అందుతుందని ఆశించిన జనాలకు మళ్లీ దేవరకద్ర వద్ద లీకేజీ కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, ఇంజనీర్ మహేష్‌లు సిబ్బందితో సోమవారం ట్రయల్‌రన్ చేసి మరమ్మతులు పూర్తి చేయడంతో దేవరకద్ర నుంచి నీరు రావల్సి ఉంది. నీటి సరఫరా పునరుద్ధరణ ఆలస్యం అవుతుండడంతో నీటి ఎద్దడి అధికం అవుతోంది. వేసవి ఆరంభంలోనే నీటి ఎద్దడి ఇలా ఉంటే రేబోయే వేసవిలో తాగునీటి ముప్పు పొంచి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దాంతో తాగునీటి కోసం నారాయణపేట వాసులు తంటాలు పడుతూ బోర్ల నీటిపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం 101 పవర్ బోర్ల ద్వారా 1.2 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. మునిసిపాలిటీ నుంచి రెండు వాటర్ ట్యాంకుల ద్వారా ఫోన్ చేసిన వారికి అత్యవసరమైన ప్రాంతాలకు మునిసిపల్ వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దర్గా ఏరియా, మడి ఏరియా, సుభాష్‌రోడ్ కలాల్‌వాడి, పళ్ల కుర్వగేరి తదితర ప్రాంతాల్లో ట్యాంకర్ల నీటి సరాఫరాకు చర్యలు తీసుకున్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా.. ఆపై లీకేజీలతో అవాంతరాలు

నారాయణపేట మునిసిపాలిటీలో ప్రజలకు రోజు విడిచి రోజు నీరు అందుతున్నా అప్పుడప్పుడు లీకేలు, నీటి సరఫరాలో అవాంతరాలతో పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అమృత్ 2.0 పథకం ద్వారా రూ.27.66 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఈమధ్యనే ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిలు శంకుస్థాపన పనులు ప్రారంభించడంతో పనులు కొనసాగుతున్నాయి. నారాయణపేట మునిసిపాలిటీలో 24 వార్డులకు గాను 58 వేల జనాభా ఉంది. రోజు విడిచి రోజు మిషన్ భగీరథ నీరు 7.20 (ఎంఎల్‌డీ) మెగా లీటర్ల నీరు అందుతుంది. కొన్ని వార్డులతో పాటు కొత్త కాలనీల్లో నీరు అందడం లేదు.

అమృత్ 2.0 పథకం కింద మూడు ట్యాంకుల నిర్మాణం

నారాయణపేట మునిసిపాలిటీలో అమృత్ 2.0 పథకం కింద టీవీ టవర్ వద్ద వెయ్యి కిలోలీటర్ల నీటి సామర్థ్యం కల్గిన ట్యాంకు నిర్మిస్తున్నారు. ఎర్రగుట్ట వద్ద 500 కిలోలీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ట్యాంకు, వాల్మీకి దేవాలయం దగ్గర వెయ్యి కిలోలీటర్లు నీటి సామర్థ్యం కల్గిన ట్యాంకు నిర్మిస్తున్నారు. అలాగే పట్టణం విస్తరించడంతో కొత్త కాలనీలతో పాటు, కొన్ని పాత వార్డుల్లో మిషన్ భగీరథ పైపులైన్ వేయని ప్రాంతాల్లో కొత్తగా పైప్‌లైన్లు వేసి నీటి సరఫరా ప్రతీరోజు అందించే అవకాశాలు లేకపోలేదు.

ప్రస్తుతం తొమ్మిది ట్యాంకులతో నీటి సరఫరా



పేట సుభాష్‌రోడ్‌లో టాంకర్‌తో నీటి సరఫరా

నారాయణపేట మునిసిపాలిటీలో రోజు విడిచి రోజు 7.20 ఎంఎల్‌డీ తాగునీటిని మిషన్ భగీరథ తొమ్మిది ట్యాంకుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం అందిస్తున్నారు. సింగారం సంప్‌హౌస్ వద్ద పది లక్షల లీటర్ల నీటి సామర్థ్యం, వాల్మీకి దేవాలయం వద్ద 700 కిలోలీటర్లు, 250 కిలోలీటర్ల రెండు ట్యాంకులు, టీవీ టవర్ వద్ద రెండు ట్యాంకుల్లో ఒకటి 300 కిలోలీటర్లు, ఇంకొకటి 200 కిలోలీటర్లు ట్యాంకులు, కుమ్మరివాడ వద్ద రెండు 600 కిలోలీటర్లు, 1000 కిలోలీటర్లు, ఎర్రగుట్ట దగ్గర 500 కిలోలీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకులు నిర్మించి తాగునీటిని అందిస్తున్నారు. ట్యాంకుల సామర్థ్యం తక్కువగా ఉండడంతో నీరు సరిపోక రోజు విడిచి రోజు అందిస్తున్నారు. ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదన్న విషయాన్ని గుర్తించిన మునిసిపల్ పాలక, అధికార యంత్రాంగం అమృత్ పథకం కోసం ప్రతిపాదనలు పంపగా ఈమధ్యకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.27.66 కోట్లు మంజూరు చేసింది. దీంతో ట్యాంకుల నిర్మాణాలు, కొత్త పైప్‌లైన్‌లతో ప్రతీనిత్యం తాగునీటిని అందించవచ్చని మునిసిపల్ అధికారులు చెప్పుకొస్తున్నారు.

13న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

గద్వాల అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బాలబాలికలకు ఈ నెల 13వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో అర్హత సాధించే క్రీడాకారులు ఈనెల 23న హైదరాబాద్‌లోని గార్డియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ, బర్త్ సర్టిఫికెట్, టెన్త్ సర్టిఫికెట్ ధ్రువపత్రాలను తీసుకురావాలని, ఎంట్రీ ఫీజు రూ.200లు ఉంటుందన్నారు. వివరాల కోసం 9492580079 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు జడ్చర్ల విద్యార్థులు



ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికైన బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు

జడ్చర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ పోటీలకు బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో ముగ్గురు అనూష, వర్ష, నిఖిత ఎంపికయ్యారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, రామ్‌కల్యాణ్, వడన్న పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఇంట్లో పౌష్టికాహారం

» బాలామృతం, పప్పు, నూనె ప్యాకెట్లు స్వాధీనం

» వివరాలు వెల్లడించిన జడ్చర్ల సీడీపీవో శోభారాణి



జడ్చర్ల పట్టణంలో కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన బాలామృతం, పప్పు, నూనె ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

జడ్చర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయకుండా, కాంట్రాక్టర్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాలామృతం, పప్పు, నూనె ప్యాకెట్లను సోమవారం జడ్చర్ల సీడీపీవో శోభారాణి పట్టుకున్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలో కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి సీడీపీవో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయాల్సిన బాలామృతం, పప్పు, నూనె ప్యాకెట్లు అక్రమంగా కాంట్రాక్టర్ కృష్ణా రెడ్డి ఇంట్లో నిల్వ చేశారంటూ విశ్వసనీయ సమాచారం అందిందని, పోలీసు, రెవెన్యూశాఖల సిబ్బందితో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 117కిలోల బాలామృతం ప్యాకెట్లు, 80కిలోల పప్పు, 8 నూనె ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని, అనంతరం వాటిని ఐసీడీఎస్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచుకున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. ఇదిలా ఉండగా, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సరఫరా చేయాల్సిన బాలామృతం ప్యాకెట్లను పశువుల దాణా కోసం కొందరికి విక్రయిస్తున్నాడని, పప్పు, నూనె ప్యాకెట్లను హోటల్స్‌కు, ఫంక్షన్ లపై ఆర్డర్‌లు చేసే వారికి అక్రమంగా విక్రయిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. జడ్చర్ల సీడీపీవో ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రఘడ్ లిఫ్ట్ ద్వారా సాగునీరు విడుదల



చంద్రఘడ్ లిఫ్ట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మోటార్ ఆన్ చేస్తున్న నాయకులు

అమరచింత, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చంద్రఘడ్ లిఫ్ట్ ద్వారా సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి మోటార్లను ఆన్ చేసి దిగువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి 25 లక్షల నిధులను విడుదల చేసి గత ఐదేళ్లుగా మరుగున పడ్డ మోటార్ల, లిఫ్టు రిపేర్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ డీఈ నారాయణ, ఏఈ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ చుక్క ఆశిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్‌లు చంద్రఘడ్ లిఫ్ట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మోటార్లను ఆన్ చేసి దిగువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత పదేళ్ల పాలకుల హయాంలో మరుగున పడ్డ చంద్రఘడ్ లిఫ్ట్‌ను తమ ఎమ్మెల్యే శ్రీహరి ప్రత్యేక నిధులను మంజూరు చేయించి లిఫ్ట్ పనులను పూర్తి చేశారని వారన్నారు. ఎమ్మెల్యే శ్రీహరి, రాష్ట్ర కాంగ్రెస్ కల్లు విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, ప్రత్యేక కృషితో లిఫ్ట్ పునః ప్రారంభమైందని వారన్నారు. రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని వారన్నారు. జేఈ వంశీకృష్ణ, నాయకులు మహేందర్ రెడ్డి, అరుణ్, వసంతరెడ్డి, వెంకట్ రెడ్డి, నల్లారెడ్డి, వెంకటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

28 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం పట్టుకున్న అధికారులు

మద్దూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 28 క్వింటాళ్ల పీడీఎస్ బియాన్ని మద్దూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో భూనీడ్ గ్రామ శివారులో బొలెరో వాహనం తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియాన్ని గుర్తించారు. దీనిపై ఆరా తీయగా దేవరకద్ర నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్లు విషయం వెల్లడైంది. ఈ బియ్యాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించగా, డీటీ ఆనంద్ పంచనామా నిర్వహించి స్థానిక డీలర్‌కు అప్పజెప్పారు. అక్రమంగా బియాన్ని తరలిస్తున్న ఓనర్ దుబ్బ శ్రీనివాస్, డైవర్ పరశురాంపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అడవికి నిప్పుపెట్టిన వ్యక్తిపై కేసు

» నిందితుడిని కోర్టుకు హాజరు పర్చిన అధికారులు

దోమలపెంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని తాటిగుండాల సెక్షన్ ఉల్లేందుల ఊట, దూబోడు ప్రాంతాల్లో ఈ నెల 2న అడవికి నిప్పు పెట్టిన శీలం బయ్యన్నపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినట్లు దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ సోమవారం విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా లింగాల గట్టు గ్రామానికి చెందిన బాల చెన్నయ్య దగ్గర మేకలు కాసేందుకు జీతం చేస్తున్నాడు. అడవిలోకి బీడీలు, అగ్గిపెట్టె తీసుకొని వెళ్లి నిప్పు పెట్టడంతో 150 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ కాలిపోయింది. ఈ నెల 3న బయ్యన్నను అదుపులోకి తీసుకుని విచారించగా తానే నిప్పు పెట్టినట్లు ఒప్పుకోవడంతో జిలా అధికారి రోహిత్ గోపిడి ఆదేశంతో కేసు నమోదు చేసి అచ్చంపేట కోర్టుకు హాజరు పర్చినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ.. మహిళ మృతి

గద్వాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండల పరిధిలోని కుర్వపల్లి గ్రామానికి చెందిన జయమ్మ (45) కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన కుర్వ పద్మమ్మ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసుకుంది. దీనికి సంబంధించిన డబ్బుల చెల్లింపులో అదే గ్రామానికి చెందిన మేస్త్రీలు రామక్రిష్ణ, కృష్ణలు ఈ నెల 6వ తేదీన గొడవపడ్డారు. మా అక్కతో గొడవ పడుతున్నారని చెల్లెలు జయమ్మ మద్దతుగా వచ్చింది. ఈ క్రమంలో మేస్త్రీలు పెనుగులాట చేస్తుండగా జయమ్మ కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. వెంటనే గద్వాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది.

కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త సోమన్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అడుగు అడుగుకో ఆలయం



● పురాతన కట్టడాలకు నిలయం పుల్లూరు

» హరిహరుడి ఆలయం ప్రత్యేకం

» 6,7 శతాబ్దంలో రెండవ పులకేశి నిర్మాణాలు

» పంచలింగాలు కలిగిన గ్రామం

» శిథిలాలయాలకు నిధులివ్వాలంటున్న గ్రామస్థులు



చెన్నకేశవస్వామి, ఇతర ఆలయాల సముదాయం

ఎండోమెంటు వారు స్పందించాలి



గ్రామంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఆలయాలున్నా ప్రాచుర్యంలోకి రాలేదు. 2008లో జరిగిన పుష్కరాలకు రూ. 55లక్షలు మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. ఇందులో ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించకపోవడంతో సింగవరం నారాయణరెడ్డి వారసులు ముందుకొచ్చి పలు ఆలయాలను అభివృద్ధి చేశారు. శిథిలమైన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

- నీలప్ప, జోగుళాంబ ఆలయ మాజీ ధర్మకర్త, పుల్లూరు గ్రామం

మాన్యం భూములను సర్వే చేయాలి



గ్రామంలో ప్రతీ వేడుక ఘనంగా నిర్వహిస్తాం. కానీ ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఆలయాల అభివృద్ధి కుంటుపడింది. మాన్యం భుములను సర్వే చేయించి వెలికి తీయాలి. నది ఒడ్డున ఉన్న భుములకు రక్షణ లేకుండా పోయింది. దీంతో దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారు.

- బెక్కేసుల ఏకాంత్, పుల్లూరు గ్రామస్థుడు

మాన్యం ఉన్నా సేవ లేదు..

ఈ ఆలయాల సేవార్థం ఆనాటి భూ స్వాములు, రాజులు సుమారు రెండువందల ఎకరాల మాన్యం కేటాయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అనుభవదారులు మాన్యం అనుభవిస్తూ, సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆలయాలతో సేవలు మరిచారని తెలుస్తున్నది. ఒకటి రెండు ఆలయాలలో తప్ప మిగతా ఆలయాలు దూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదని, కనీసం పర్వాదినాలలో కూడా వాయిద్యాకారులు రావడంలేదని గ్రామస్థులు తెలిపారు. తుంగభద్ర నదీ తీరాన భైరంగుళ్ల వద్ద అతిపురాతన ఆలయాలు 2009లో వచ్చిన వరదలకు దెబ్బ తిన్నాయని వీటి పునరుద్ధరణ కోసం, శిథిలమైన ఆలయాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే దేవుడి భూములు చాలా వరకు అన్యాక్రాంతమయ్యాయని, ఆలయాల భూములు సర్వే చేయాలని గ్రామస్థులు కోరారు.

అలంపూర్‌చౌరస్తా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అది జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామం. అతి పురాతన గ్రామాల్లో ఇది ఒకటి. ఆనాడు పూలఊరుగా పిలవబడుతూ నేడు పుల్లూరుగా మారింది. తుంగభద్ర నది ఒడ్డున ఈ గ్రామం అతి ప్రాచీన కాలం నుంచి విరాజిల్లుతున్నది. తుంగభద్రమ్మ అవిర్భావ ప్రాంతం నుంచి 64 స్నానపు ఘట్టాలలో ఇది ఒకటి కావడం విశేషం. పూర్వం రాయలసీమ నుంచి తెలంగాణ ప్రాంతంలోకి వెళ్లేవారు.. ధాన్యపు గింజలను తరలించేవారు.. ఇదే గ్రామం గుండా ప్రవేశించాలి. వారంతా ఇక్కడ సుంకం చెల్లించి వెళ్లేవారు. సుంకం చెల్లింపుల విషయంలో రాయలసీమ ప్రాంతంలోని నిడుదవోలు (నేడు నిడ్జూరు) నవాబులతో గద్వాల సోమనాద్రికి మధ్య బీకర యుద్ధమే జరిగిందని చరిత్ర చెబుతుంది.

బాదామి చాళుక్యుల నిర్మాణాలు

7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులలో రెండవ పులకేశి మహారాజు ఆయన పర్యటనలో భాగంగా పుల్లూరు గ్రామంలో శంకరనారాయణ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. భస్మాసురుడు అనే రాక్షసుడు ఘోర తపస్సు చేసి శివుని దర్శనం పొందుతాడు. ఎవరి తలపై చేయి పెడితే వారు భస్మం కావాలనే వరం పొందుతాడు. ఆయన ప్రసాదించిన మహిమను పరీక్షించేందుకు గాను నీ తలపైనే చేయి పెడతానని చెప్పడంతో శివుడు పారిపోతాడు. ఆ సమయంలో శివుడిని కాపాడేందుకు గాను విష్ణువు మోహిని అవతారంలో వచ్చి తన అందచందాలతో భస్మాసురిడిని మోహిస్తాడు. ఆ వ్యామోహంలో తన చేయిని తన తలపైనే పెట్టుకునేవిధంగా పురిగొల్పుతాడు. అలా రాక్షసురుడు అంతం కాగా, మోహిని అవతారంలో ఉన్న విష్ణువును చూసిన శివుడు ఆమెను ఆవహించే రూపమే శంకరనారాయణుడు లేదా హరిహరుడు అంటారు. ఈ రూపమే పుల్లూరు గ్రామంలో అప్పటి రాజు రెండవ పులకేశి మహారాజు ప్రతిష్ఠించాడు. ఇది రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేదని జోగుళాంబ ఆలయ మాజీ ధర్మకర్త నీలప్ప తెలిపారు. ఇక్కడ నిర్మించి మరో ప్రసిద్ధి చెందినది సూర్యనారాయణస్వామి ఆలయం. ప్రతీ రథసప్తమి రోజున సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తగలడం ప్రత్యేకత. ఈ పర్వదినాన భక్తులు భారీ సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు.



కాలభైరవుడికి పూజలు చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

పంచ లింగాలు...

7వ శతాబ్దంలో రెండవ పులకేశి మహారాజు హయాంలో ఇదే గ్రామంలో జ్యోతిర్లింగాలు కలిగిన పంచలింగాలు సైతం ప్రతిష్ఠించారు. అవి.. మహారుద్ర లింగం, నాగేశ్వరలింగం, వాయులింగం, బీమలింగం, బాలబ్రహ్మేశ్వరలింగం. వీటి మధ్యలో సాక్షీ గణపతి విగ్రహాలను నెలకొల్పారు. ఆ తర్వాత శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆయన అలంపూర్ పుణ్యక్షేత్రానికి వెళ్తుండగా పుల్లూరులో కొన్ని రోజులు గడిపారు. ఇదే సమయంలో కృష్ణదేవరాయలు చెన్నకేశవస్వామి, నీలకంఠేశ్వర, అభయంజనేయస్వామి ఆలయాల నిర్మాణానికి పూనుకున్నారు. ఇక్కడ అన్ని ఆలయాలు తూర్పు ముఖంలో దర్శనమిస్తాయి. నది ఒడ్డున కాలభైరవ, కోట ఆంజనేయస్వామి, సూర్యనారాయణస్వామి, వీరభద్రస్వామి, చౌడేశ్వరి ఆలయాలు కూడా అతి పురాతన కాలంలోనే నిర్మించారు. ఇవి నిజాం నవాబుల కాలంలో ధ్వంసానికి గురయ్యాయి. నదికి ఆనుకుని ఉన్న ఈ ఆలయాలలో కాలభైరవుడి ఆలయం పక్కన రాతి గుహలున్నాయి. ఈ గుహలలో ఆ కాలంలో రుషులు, మునులు, తపస్సు చేసేవారని చరిత్ర చెబుతుంది. ఈ ఆలయాల్లో పుల్లూరుతో పాటు కలుగొట్ల గ్రామాల ప్రజలు పండుగల సమయంలో వెళ్లి పూజలు చేస్తూండేవారు. 2009లో తుంగభద్ర ఉగ్ర రూపానికి ఆలయాలు దెబ్బతిన్నాయి. దీంతో గ్రామానికి చెందిన సింగవరం నారాయణరెడ్డి వారసులే కల్పించుకుని మిడతలపాడు వద్ద ఉన్న శివాలయం ముందు షెడ్డు, చెన్నకేశవస్వామి ఆలయం వద్ద కళ్యాణమండపం, వినాయకగుడి పునరుద్ధరణ పనులు, ఈదమ్మ, సావరమ్మగుడుల వద్ద పలు అభివృద్ధి పనులు, ఆంజనేయస్వామి చుట్టూ ఆనుకుని ఉన్న స్థలసేకరణకోసం సుమారు రూ.18లక్షలు, శుభకార్యాలయాల కోసం వాల్మీకి గుడిముందు, ఎస్సీ కాలనీలో భారీ షెడ్లు నిర్మిస్తూ గ్రామపెద్దల సహకారంతో అధ్యాత్మిక స్థావరాలను కాపాడుకుంటూ వస్తున్నారు.

విద్యానిధికి భారీ విరాళం

● మై హోమ్ గ్రూప్స్ నుంచి రూ.10 లక్షలు



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ద్వారా కలెక్టర్ విజయేందిర బోయికి 10 లక్షల చెక్కును అందించిన మై హోమ్ గ్రూప్స్ ప్రతినిధి చింత శ్రీనివాస్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పేదవిద్యార్థుల అభ్యున్నతే తన లక్ష్యంగా పెట్టుకున్న మహబూబ్‌నగర్ శాసన సభ్యుడు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఈ సంవత్సరం జనవరిలో మహబూబ్‌నగర్ విద్యానిధిని ప్రాంభించిన విషయం జిల్లా ప్రజలకు తెలిసిన విషయమే. ఆ నాటి నుంచి నేటి వరకు విద్యానిధికి ప్రతీ ఒక్కరు తమ ప్రయత్నంగా అధికారులు, నాయకులు విరాళాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం మై హోమ్ గ్రూప్స్ సంస్థ ప్రతినిధి చింత శ్రీనివాస్, శాసనసభ్యుడు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ద్వారా కలెక్టర్ విజయేందిర బోయిని తన చాంబర్‌లో కలిసి రూ.10 లక్షల చెక్కును మహబూబ్ నగర్ విద్యానిధికి అందజేశారు. అదేవిధంగా మహబూబ్ నగర్ కు చెందిన పురుశోత్తమ రెడ్డి రూ.5 వేల చెక్కును అందజేశారు. మై హోమ్ గ్రూప్స్ సంస్థ ఇంత తక్కువగా చెక్కును అందజేశారు అని కలెక్టర్ అన్న మాటకు సంస్థ ప్రతినిధి చింత శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం మరిన్ని నిదులు ఇస్తామని బదులిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విద్యానిధికి వచ్చే విరాళాలన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న పేదవిద్యార్థుల అభ్యున్నతికి ఖర్చు చేస్తామని అన్నారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే వారికి శిక్షణ తరగతులు ప్రాంభిస్తామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అత్యవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తామన్నారు. ఈ ప్రక్రియ అంతా కలెక్టర్ ఆధ్వర్యంలోనే పారదర్శకంగా జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ విద్యానిధిని ప్రారంభించిన విషయం తెలుసుకున్న మై హోమ్ గ్రూప్స్ సంస్థ వారు విద్యానిధికి 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన వారికి జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ 4 సంవత్సరాల కాలంలో మహబూబ్ నగర్ విద్యానిధికి 10 కోట్లు జమ చేయాలని తాను లక్ష్యంగా పెటుకున్నానని అన్నారు. అందులో అందరూ (ప్రజలు, వ్యాపారస్తులు, ప్రభుత్వ ఉద్యోగులు) భాగస్వాములు అయ్యి విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. 10వ తరగతి పూర్తి చేసి రానున్న విద్యాసంవత్సరం మహబూబ్ నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే హన్వాడా మండలం వేపూరు, మహబూబ్ నగర్ రూరల్ మండలం మన్యంకొండ, నుంచి వచ్చే విద్యార్థులను తీసుకవచ్చి తిరిగి వారి గమ్యానికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, మాజీ కౌన్సిలర్ శంకర్, ఎం.ప్రవీణ్‌కుమార్, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రిలో మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు

» సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్



శస్త్రచికిత్స విజయవంతంపై మాట్లాడుతున్న రోగులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనరల్ ఆసుపత్రిలో ఉచితంగానే మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు పునః ప్రారంభించినట్లు .ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఇదే విషయంపై సోమవారం ఆసుపత్రి సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమేష్‌లు శస్త్రచికిత్స చేసిన వారి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేసేవారని, కానీ కొన్ని అనివార్యకారణాల వలన అవి ఆగిపోయాయన్నారు. అయితే ఇటీవల శస్త్రచికిత్సలు పునః ప్రారంభించామని తెలిపారు. నారాయణపేటకు చెందిన అనంతమ్మకు తుంటి కీలు మార్పిడి, రాములుకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేశామని పేర్కొన్నారు.

ఈ శస్త్రచికిత్సలు అన్ని ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగానే చేశామన్నారు. ఇకపై ఎవరైనా చేసుకోవాలంటే ముందుగా ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యి ఆరోగ్యశ్రీలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇవే ఆపరేషన్లు బయటి ఆసుపత్రిలో చేసుకోవాలంటే రూ. 2.50 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కానీ ఆసుపత్రిలో ఉచితంగానే చేస్తున్నామన్నారు. చాలా మంది ఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్నారని, అయితే ఖర్చుతో కూడుకున్నది కావడంతో వెనుకడుగు వేస్తున్నారన్నారు. మోకీలు మార్పిడి అంటే ధనికులకే కాదు పేదవారికి కూడా అవకాశం ఉంటుందని తెలియజేసేందుకు ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్సలు ప్రారంభించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. మోకీలు శస్త్రచికిత్స బృందం డాక్టర్లు డాక్టర్ శివరాంనాయక్, డాక్టర్ అనిల్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ లాలునాయక్, డాక్టర్ మాధవి, డాక్టర్ నరేష్, డాక్టర్ వినోద్, డాక్టర్ ఉదయ్, డాక్టర్ నాగకిశోర్, డాక్టర్ నీరజలతో పాటు ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

మహబూబ్‌నగర్‌అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం చేరేందుకు మైనార్టీ గురుకులాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ) ఖాజాబహాద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈటీ కోర్సుల్లో మైనార్టీ విద్యార్థులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బస, భోజన వసతి ఉంటుందరి, నాణ్యమైన విద్యను అందిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ లేదా, నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు.

బొలెరోను ఢీకొన్న ట్రాక్టర్

» బోల్తా పడటంతో 31మంది కూలీలకు గాయాలు

» అందులో ఐదుగురిని కర్నూల్ ఆసుపత్రికి తరలింపు

» కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలిస్తున్న దృశ్యం

గద్వాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న బొలెరో వాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో వాహనం బోల్తా పడగా, అందులో ప్రయాణిస్తున్న 31మందికి గాయాలు కావడంతో గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన సోమవారం ఉదయం జమ్మిచేడు గ్రామం వద్ద చోటు చేసుకున్నది. రూరల్ ఎస్సై శ్రీకాంత్, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధరూర్ మండలం పాతపాలెం, జాంపల్లి గ్రామాలకు చెందిన కూలీలు మిరప పంటలో పనిచేయడానికి ఇటిక్యాల మండలం ధర్మవరం గ్రామానికి బొలెరో వాహనంలో వెళుతున్నారు. ఇందులో దాదాపు 40మంది వరకు వెళుతున్నారు. అదే సమయంలో జమ్మిచేడు గ్రామం నుంచి ట్రాక్టర్ కర్నూల్ రోడ్డు దాటాల్సి ఉంది. అతివేగంతో వెళుతున్న ట్రాక్టర్ వస్తున్న బొలెరో వాహనాన్ని గమనించకుండా రోడ్డు దాటే ప్రయత్నం చేసి బొలెరోను బలంగా ఢీకొట్టాడు. దీంతో బొలెరో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న కూలీల్లో ఒకరిపై ఒకరు పడటంతో పాటు రోడ్డుకు కొందరు విసిరేసి పడినట్లు కావడంతో కొందరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అందులో స్వల్పంగా గాయపడిన 26 మందిని ప్రథమ చికిత్స అనంతరం పంపించి వేశారు. తీవ్రంగా గాయపడిన కృష్ణ (జాంపల్లి), పాతపాలెం గ్రామానికి చెందిన నవరప్ప, పావని, పద్మ, శాంతమ్మలను కర్నూల్‌కు తరలించారు. వారితో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మిగిలిన ముగ్గురు కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ వసీన్‌పై కేసు నమోదు చేయగా పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనం డ్రైవర్ మహబూబ్‌పై కూడా కేసు నమోదు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సీఐ టంగుటూరి శ్రీను సంఘటన స్థలాన్ని పరిశీలించి, మెరుగైన చికిత్స అందింప చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందిన మహిళలు

న్యూస్ బాక్స్

విద్యార్థులకు కార్పొరేట్ వైద్యం అందించాలి

» ఎంఈవో నాగ్య నాయక్



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవాబ్‌పేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు కార్పొరేట్ వైద్యం అందాలని ఎంఈవో నాగ్యనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని యన్మనగండ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎస్‌వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లలు చిరుతిళ్లు తిని దంతాలు పాడు చేసుకోవద్దన్నారు. అంతకుముందు ఎంఈవో మండలంలోని కొండాపూర్ తదితర పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, జితేందర్, వనజ, విజయ్‌కుమార్‌గౌడ్, జనార్దన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన బాలికలు

చిన్నచింతకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన నందిని, అలేఖ్య, వైష్ణవి, మానస అండర్-16 అథ్లెటిక్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. మరిన్ని పతకాలు సాధించాలని మాజీ సర్పంచ్ రఘువర్ధన్‌గౌడు, విష్ణుమూర్తి, నవీన్ పలువురు అభినందించారు.


నాణ్యమైన ఆహారం అందించాలి

కోయిలకొండ, 10 మార్చి (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించాలని ఎంపీడీవో హరీశ్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని పారుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. ప్రతి రోజు ఒక రకం అందించాలని సూచించారు. మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్ హెచ్ఎం విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

కోయిలకొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సంగీత అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల సాధికారత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాలికలు రక్తహీనత లోపం లేకుండా ప్రతి రోజు ఆకు కూరలు, పాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే 100కు ఫిర్యాదు చేయాలని మహిళా పోలీస్ సుజాత తెలిపారు.

కందూరు నారాయణకు ఘన నివాళి



కందూరు నారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మూసాపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ దివంగత కందూరు నారాయణ ఆశయసాధన కోసం కృషి చేయాలని అడ్డాకుల మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.బీ మన్నెయాదవ్ అన్నారు. సోమవారం అడ్డాకుల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నక్సల్ తూటాలకు బలైన కందూరు నారాయణ 21వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళి అర్పించారు. పేదల అభ్యున్నతి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్ గౌడ్, బుచ్చన్నయాదవ్, నర్సింహ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతకుమార్‌ను పరామర్శించిన మాజీ ఎంపీ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్‌ను మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి పరామర్శించారు. శాంతకుమార్ తండ్రి బండారి లక్ష్మణ్ ఇటీవల మృతి చెందారు. సోమవారం వారి ఇంటికి చేరుకొని బండారి లక్ష్మణ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అలాగే బీజేపీ నాయకులు, నటరాజ్, పరామర్శించారు.

మహిళా హక్కుల కోసం పోరాడుదాం

» సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



మహబూబ్‌నగర్‌లో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాలమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం పోరాటం చేద్దామని కేవీపీఎస్, సీఐటీయూ, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శులు మాణిక్యంరాజు, నల్లవెల్లి కురుమూర్తి, మధుబాబు పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

చదువుల తల్లి సావిత్రిబాయి

చదువుల తల్లి సావిత్రిబాయి సమాజంలో అనేక మందికి చదువు చెప్పి ఆదిగురువుగా నిలిచిందని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. సీపీఐ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

మహబూబ్‌నగర్: సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శమని బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. గడియారం చౌరస్తాలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కోరమోని నర్సింహులు, శివరాజు, శ్రీకాంత్‌గౌడ్, తాటిగణేశ్, నరేందర్, రాము, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, నిరంజన్‌చారి, పాలసతీశ్, గణేశ్, లక్ష్మణ్, వరద బాస్కర్, దత్తురావు, శ్రీనివాసులు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో..

జడ్చర్ల: బీసీ జాగృతి సేన నాయకులు పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ప్రాంగణంలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నిరంజన్, నర్సింహులు, విజయ్‌కుమార్, లింగంపేట శేఖర్, రామస్వామి, భీంరాజ్, రాధాకృష్ణ, రాఘవేందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని వాడియాల గ్రామ బస్ స్టేజీ సమీపంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుకుమార్, నర్సింహ, యాదయ్య, రాములు, అంతిరెడ్డి, రవి, శంకర్, మహేశ్ పాల్గొన్నారు.



జడ్చర్లలో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



మిడ్జిల్ మండలం వాడియాల స్టేజి వద్ద..

భూమిని కాపాడాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష



కార్యాలయం ఎదుట కూర్చున్న సులోచనాదేవి

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కేంద్రానికి చెందిన పల్నాటి సులోచనాదేవి సోమవారం నిరసన దీక్ష చేపట్టింది. తనకు చెందిన నాలుగు ఎకరాల భూమిలో, ఎకరం భూమిలో ప్రైవేటు రోడ్డును వేసి కబ్జాకు గురి చేసినట్లు తెలిపారు. మరో ఎకరం చుట్టూ ఉన్న రైతులు కబ్జా చేశారు. తన భూమిని కాపాడి స్వాధీనం చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని, వారికి ఉద్యోగాలు లేనందున భూమినే నమ్ముకొని వ్యవసాయం చేసుకోవాల్సి ఉందని అన్నారు. రెండు ఎకరాలు కబ్జాకు గురి కావడంతో తాము ఎలా జీవించాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని తెలిపారు. అధికారులు భూమిని సర్వే చేసి ఇప్పించాలని కోరారు.

పాలమూరును ఎడ్యుకేషన్ హబ్ చేస్తాం



కళాశాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరును ఎడ్యుకేషన్ హబ్ చేయాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అల్ మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జీకే ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల ఏర్పాటును పరిశీలించారు. 40 ఏళ్లుగా అల్ మదీనా ఎడ్యుకేషన్ ట్రస్టు విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపించాలని సభ్యులకు సూచించడం జరిగిందని గుర్తు చేశారు. వెంటనే వారు కార్యచరణ ప్రారంభించడంతో ఏఐసీటీఈ అధికారులు సైతం పరిశీలన పూర్తి చేశారన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, శ్రీనివాస్‌యాదవ్, ఇంతియాజ్ ఇసాక్, అమ్జద్ , సలీం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని అల్లీపూర్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్డడ పనులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆనంద్ గౌడ్, అనిత, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఎంపీడీవో జయరాములు

నవాబ్‌పేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న చోట తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో జయరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రతి కూలీకి వడదెబ్బ తాకకుండా సకాలంలో పనులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో భద్రునాయక్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బోనస్ డబ్బులు వేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

రాజాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సన్నవడ్లు అమ్మిన ప్రతీ రైతుకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు జమ చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ఇద్గాన్‌పల్లికి చెందిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం విక్రయించినా, బోనస్ డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనంద్, శేఖర్, గంగాధర్ గౌడ్, బాలగౌడ్, శేఖర్, బాలరాజ్, మధు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 238 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షను సోమవారం జిల్లాలో 36 కేంద్రాలలో నిర్వహించారు. పరీక్షకు 238 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 8,398 మందికి గాను, 8,206 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,760 మందికి గాను 1714 మంది హాజరయ్యారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

మూసాపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానంపేటకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పల్లి శివరాములు ఇటీవల గుండెపోటుకు గురై జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, లక్ష్మీనర్సింహయాదవ్, చంద్రశేఖర్, జమీర్, రవీందర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంబురాల్లో పాల్గొనండి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి, 10 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో హోలీ సంబురాలు 14న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్ది యాదిరెడ్డి, నలిగేశి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి 10:36 గంటలకు అన్ని బస్తీలలో కామదహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం హోలీ సంబురాలలో భాగంగా ఉదయం 9 గంటలకు జిల్లా గ్రంథాలయం దగ్గర ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్దకు అందరు చేరుకోవాలని కోరారు. పూజలు నిర్వహించిన అనంతరం సంబురాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బోరుబావి విషయంలో అన్నదమ్ముల ఘర్షణ

మూసాపేట,మార్చి 10(ఆంధ్రజ్యోతి): సొంత పొలం బోరుబావి నీటి వంతుల విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ తలెత్తి అన్నపై తమ్ముడు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాయిపల్లికి చెందిన అన్నదమ్ములు బాలకిష్టయ్య, రవి మధ్య గొడవ తలెత్తి అన్నపై తమ్ముడు దాడి చేశాడు. సోమవారం అన్న ఫిర్యాదు మేరకు తమ్ముడు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలకు సన్మానం

జడ్చర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం నిర్వహించారు. స్థానిక మునిసిపాలిటీలోని నాగసాలలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల సభ్యులకు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగన్, హెచ్ఎం సావిత్రి, సుమానందిని, జ్యోతి, సరస్వతి, శారద, లావణ్య, స్వాతి, వెంకటమ్మ, యాదమ్మ, సంధ్య, రాధిక, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రుసుంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులతో కలిసి ఆట పాటలతో సంతోషంగా గడిపారు. హెచ్ఎం చంద్రకాంత్, బాలమణి, అంజమ్మ, అరుణ, సరస్వతి, శ్యామల, సునీత, పద్మమ్మ, అలవేలు, అమృతమ్మ, సునిత పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

జడ్చర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యమైన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ప్రకారం.. దేవరకద్ర మండలం జీనుగురాల చెందిన కడారి మహేశ్వర్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం అనితను వివాహం చేసుకున్నాడు. వీరు నెల రోజుల క్రితం జడ్చర్లకు వచ్చి మదీనకాలనీలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఈ నెల 7న ఉదయం ఇంటి సామగ్రి తెచ్చేందుకు భార్యాభర్తలు వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంలో ఆసుపత్రికి వెళ్లి వస్తానని భార్య చెప్పింది. తిరిగి రాకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

» కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత కల్పిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 82 ఫిర్యాదులు అందుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జడ్పీసీఈవో వెంకటరెడ్డి, డీఆర్డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించినట్లు ఎంపీడీవో గీతాంజలి, డీటీ రవికాంత్ తెలిపారు. రాణిపేటలో శ్మశానవాటిక విషయంలో మూడు నెలల కిందట ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు చేపట్టడం లేదన్నారు. మర్లాబాయితండాలోని రోడ్డుపై ఇంటి ప్రహరీ నిర్మాణం చేపట్టారని, సీసీ రోడ్డడ నిర్మాణం చేపట్టేందుకు ఇబ్బందిగా మారిందని, రోడ్డును ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

» డీఈవో ప్రవీణ్‌కుమార్



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులను సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ పాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రెండో తరగతి విద్యార్థులతో గణితంపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధ కోసం ఉపయోగిస్తున్న టీవీ వినియోగాన్ని పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న బోజనం పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు సేవాభావంతో బోధించాలి

దివ్యాంగ విద్యార్థులకు విద్యనందించే ఉపాధ్యాయులు సేవాభావంతో బోధించాలని డీఈవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలీన విద్యా రిసోర్స్ పర్సన్ సమీక్షకు డీఈవో హాజరై మాట్లాడారు. ప్రతీ ఐఆర్‌సీకి ర్యాంపు నిర్మాణాలు, ఇతర మరమ్మతు చేయాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో స్పెషల్ టీచర్స్ కేటాయిస్తున్నట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీఎంవో బైకాని బాలు యాదవ్, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

» దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మినిగోనిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఏగ్రామంలో కూడా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, ఫారుక్‌అలీ, లక్ష్మీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

భూత్పూర్: గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి పర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో నల్లగుట్ట తండా, రాందాస్‌చెరువు తండాల మీదుగా పాలమూరు వెళ్లే బైపాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం మునిసిపాలిటీ కేంద్రంలో జంతువుల జనన నియంత్రణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్, లిక్కి నవీన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, శివరాములు, నరేందర్, వెంకటేష్, మశ్చందర్, శ్రీకాంత్, వెంకటేష్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

చిన్నచింతకుంట: మండలంలోని దమగ్నాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బాలకిష్టారెడ్డి, రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కందూరు బ్రహ్మోత్సవాలు



కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయం

మూసాపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరులో రెండో దక్షిణకాశీగా పేరుగాంచిన రామలింగే శ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో రాజేశ్వర్‌శర్మ తెలిపారు. పురాతన కాలం నాటి ఈ ఆలయం, దక్షిణవైపు ప్రధాన ద్వారంతో పాటు గర్భాలయంలో స్వామి వారు పడమటిపైపునకు అభిముఖుడై వెలియడం ఇక్కడి ప్రత్యేకత. 12న పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం, 13న ప్రభోత్సవం, 14న శుక్రవారం తెల్లవారుజామున స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు.

పునరావాస ప్యాకేజీని రూ.25లక్షలకు పెంచాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు

జడ్చర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ కింద రూ.25లక్షలకు పరిహారం పెంచి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని ఉదండాపూర్ సమీపంలోని నిర్వాసితులు చేపట్టిన రిలేదీక్షలు సోమవారం 31వ రోజుకు చేరాయి. సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ నెలలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలను ఎజెండాగా పెట్టాలని కోరారు. 18ఏళ్లు నిండిన వారిని నోటిఫికేషన్ జారీ అయిన నాటినే కటాఫ్‌గా తీసుకోకుండా, తాజాగా పరిస్థితిని పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి 300 గజాల స్థలం ఇవ్వాలని, గ్రామాన్ని పునర్నిర్మాణం చేపట్టాలన్నారు. 13 మంది నిర్వాసితులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దీప్లానాయక్, జగన్, తెలుగుసత్తయ్య, మోహన్, రామకృష్ణ, శ్రీనివాస్, హబీబ్, అయ్యలప్ప, శంకర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.